క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గట్టు: మెరుగైన విద్యుత్ సరఫరా అందించే క్రమంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏడీఈ గోవిందు, ఏఈ చెన్నయ్య మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. శంకర్‌నగర్, చింతలకుంట 11కేవీ ఫీడర్లపై చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గొర్లఖాన్‌దొడ్డి, ఆరగిద్ద, బల్గెర, మాచర్ల, గట్టు, యల్లందొడ్డి గ్రామాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భీమ్ ఆర్మీ గ్రామ కమిటీ ఎన్నిక



అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురం గ్రామంలో మంగళవారం భీమ్ ఆర్మీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్ ప్రకాష్ మాట్లాడారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మేషేక్, ఉపాధ్యక్షుడిగా అమోషన్, ప్రధాన కార్యదర్శిగా తిమోతి, కోశాధికారిగా యోహాన్, గ్రామ కార్య నిర్వాహణ కార్యదర్శిగా భీమేష్ ఎంపికైనట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు సన్మానం



అయిజ: పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ తాహేర్ మంగళవారం సన్మానించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రక్తదాన కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానంతో ప్రాణదాతలను కావచ్చన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



అలంపూర్: మండలంలోని సుల్తానాపురం గ్రామస్తులు మంగళవారం హైదరాబాద్‌లో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డా.సంపత్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎర్రవల్లి మాజీ సర్పంచ్ జోగుల రవి, హస్కాని వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఇసుక టిప్పర్ పట్టివేత



గట్టు: కర్ణాటకకు చెందిన ఇసుక టిప్పర్ మంగళవారం గట్టు పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాలు.. ఉదయం 9 గంటల ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న పోలీసులు భీమేష్, భరత్‌కు కర్ణాటకకు చెందిన కేఏ 36సీ 3530 నంబర్ కలిగిన టిప్పర్‌లో ఇసుకను యల్లందొడ్డి వైపు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. యల్లందొడ్డి శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. టిప్పర్ యజమాని రంగనాయక్, డ్రైవర్ నందప్ప జయరాంను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో : వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా నుంచి అలంపూర్‌కు వెళ్లే మార్గంలో జోగుళాంబ రైల్వే హాల్ట్ సమీపంలో బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం రాత్రి బైక్‌పై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని బొలెరో వాహనం ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి రోడ్డుపై పడి తలకు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గాయపడిన వ్యక్తిని 108 అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

‘చెత్త’ చింత తీర్చేదెవరూ ?

- గ్రామాల్లో రోడ్ల పక్కనే చెత్తా చెదారం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- వర్షాకాలంలోనూ ఫాగింగ్ కరువు



బైరాపురంలో రోడ్డు పక్కన చెత్త డంప్

ఉండవెల్లి: గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రతి పంచాయతీలో డంపింగ్ యార్డులు నిర్మించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాల్సి ఉంది. కానీ గ్రామాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సేకరించిన చెత్తను రోడ్ల పక్కన, అటవీ ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. రోడ్లు, ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తుండటంతో దుర్వాసన, దోమల వృద్ధితో అల్లాడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

15 పంచాయతీల్లోనూ అదే తంతు

మండలంలోని 15 గ్రామ పంచాయతీలు ఉండగా, ప్రతి పంచాయతీలో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా రూ.లక్షలు ఖర్చుపెట్టి చెత్త సేకరణ రిక్షాలు, ట్రాక్టర్లను కొనుగోలు చేసి సిబ్బందికి అప్పగించింది ప్రభుత్వం. కానీ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో గ్రామాల్లో సేకరించిన చెత్త ఎక్కడ పడితే, అక్కడ వేస్తు పర్యావరణానికి ముప్పు తెస్తున్నారు.



చిన్నఆముదాలపాడులో రోడ్డు పక్కన ఉన్న పొదల్లో వేసిన చెత్త

మారుమూల ప్రాంతాల్లో తిరగని ట్రాక్టర్లు

గ్రామాల్లో చెత్త సేకరణకు ట్రాక్టర్లను గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం అప్పగించింది. చెత్త, మొక్కలు తరలించేందుకు ఏర్పాటు చేయగా ఎలాంటి పనులకు ఉపయోగించుకోకుండా ట్రాక్టర్లను పక్కకు పెట్టేశారు. మేజర్ పంచాయతీల్లో జీతాలు చాలడం లేదని కార్మికులు బంద్ చేసిన సంఘటనలు ఉన్నాయి. గ్రామాల్లో కనీసం ఫాగింగ్, బ్లీచింగ్ పనులు కూడా చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా

మండలంలోని బైరాపురం, బస్వాపురం గ్రామాలకు ఒకేచోట డంపింగ్ యార్డులు ఉన్నాయి. బస్వాపురం, బొంకురు, మెన్నిపాడు గ్రామాల్లో వైకుంఠ దామం వద్ద ఉన్న యార్డుకు తాళం వేశారు. డంపింగ్ యార్డుకు చెత్త చేరకపోవడం అవి కాస్త అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బొంకూరులో మురుగు కాల్వ పక్కన వేసిన చెత్త

ప్రైవేటు పనులకు నిధులు

మేజర్ పంచాయతీలైన ఉండవెల్లి, బైరాపురం, తక్కశీల, బొంకూరు, పుల్లూరు పంచాయతీల్లో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు లేవని అధికారులు చెబుతున్నా.. ప్రైవేటు కార్యక్రమాలు, అక్రమ వసూళ్లు మాత్రం తగ్గడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే పుల్లూరు పంచాయతీ కార్యదర్శి ఏసీబీకి చిక్కిన విషయం విదితమే.

ఇంట్లోకి వస్తున్న చెత్త

రెండు గ్రామాలకు గతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసిన ప్రయోజనం లేకుండా పోయింది. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డు పక్కనే చెత్తను వేస్తున్నారు. అవి ఇళ్లలోకి చేరడంతో ఇబ్బందులకు గురవతున్నాం.

- నవీన్‌కుమార్, బైరాపురం, ఉండవెల్లి

రోడ్ల పక్కనే డంప్

గ్రామంలో రోడ్ల పక్కనే చెత్త వేయడంతో నానా అవస్థలు పడుతున్నాం. చెత్త సమస్య తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. మురికి కాల్వలో చెత్త పేరుకుపోతున్న తొలగించడం లేదు.

- మధు, బొంకూరు

చర్యలు తీసుకుంటాం

ప్రతి గ్రామంలో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించేలా చర్యలు తీసుకుంటాం. చెత్త సమస్యపై కార్యదర్శులను వివరాలు అడిగి తెలుసుకుంటాం. వర్షాలు పడుతుండటంతో చెత్తను రోడ్ల పక్కనే డంప్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి.

- తిరుపతన్న, ఎంపీడీఓ, ఉండవెల్లి

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య

అలంపూర్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నట్లు ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని భీమవరం గ్రామంలో మంగళవారం ప్రభుత్వ బడి.. మన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు యూనిఫాం, ఉచిత పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటిస్తూ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. గ్రామసభ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలో మధు, కృష్ణ, పెద్దయ్య, సీఆర్పీ మునెమ్మ, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



అమరవాయిలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు వివరాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కర్

మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామంలో మంగళవారం ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు కాంతారెడ్డి, వేల్పుల రవి, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ముండ్లదిన్నెలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్న లబ్ధిదారులు

నిర్మాణ పనులు వేగవంతం

రాజోళి: మండలంలోని ముండ్లదిన్నె గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. గ్రామంలో 13 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే పునాదులు నిర్మించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను అధికారులు పరిశీలించారు.

మాంటిస్సోరిలో డాక్టర్స్ డే వేడుకలు



విద్యార్థులను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

అలంపూర్: పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2025 నీట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు వైశాలి, చేతన, హర్షతేజ, సిద్దార్థ్, టేకేశ్వర్‌తో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు. పాఠశాల డైరెక్టర్ కెఎస్‌వీ రవిప్రకాష్ మాట్లాడుతూ.. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో వైద్య వృత్తిలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాక్షించారు. ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ.. పాఠశాలలో ఆరో తరగతి నుంచి నీట్, ఐఐటీ, పోటీ పరీక్షలు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉపయోగంపై అవగాహన

వీపనగండ్ల: చిరుధాన్యాల పెంపకం వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని రైతువేదికతో పాటు గోపల్‌దిన్నె, బొల్లారం గ్రామాలలో చిరుధాన్యాల సాగులో పాటించాల్సిన మెలకువలపై అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తల ద్వారా సూచనలు, సలహాలు ఇప్పించడంపై రైతులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని రైతునేస్తం కార్యక్రమంలో ఏడీఏ డాకేశ్వర్‌గౌడ్, పలువురు రైతులు పాల్గొన్నారు.



రైతునేస్తంలో పాల్గొన్న రైతులు

పోస్టాఫీసు ఖాతాలో డబ్బులు మాయం

మానవపాడు: పీఎం కిసాన్ కింద రైతు పోస్టాఫీసు ఖాతాలో జమ అయిన డబ్బులు మాయమైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన రైతు శ్రీకాంత్‌రెడ్డి పోస్టాఫీసు ఖాతాలో కొన్ని సంవత్సరాలుగా పీఎం కిసాన్ డబ్బులు జమ అవుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో తన ఖాతాలో డబ్బులు మాయమైన ఘటనపై మంగళవారం మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు అందుకున్న పోస్ట్‌మాస్టర్ రామనాథ్ రెడ్డి ఖాతాను పరిశీలించగా ఖాతా నుంచి రూ. 4500 డబ్బు మాయమైనట్లు తెలిపారు. రైతు ఖాతాలో డబ్బులు మాయమైన విషయం సోషల్ మీడియాలో హల్చల్ అవుతోంది.

ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



ఇటిక్యాల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని మండల వైద్యాధికారి రాధిక సిబ్బందికి సూచించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన నెలవారి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్య కార్యక్రమాలను వంద శాతం అచీవ్‌మెంట్‌తో చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం మండల వైద్యాధికారి రాధికను శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శేఖర్‌శెట్టి, వెంకటేష్, ధనలక్ష్మి, చంద్రనాగమ్మ, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

పాన్‌గల్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ బాలీశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు నిహారిక అన్నారు. మంగళవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తీసుకునే ఆహారం సమతుల్యంగా ఉండాలన్నారు. శారీరకంగా, మానసికంగా వచ్చే మార్పులు, భావోద్వేగాల్లో వచ్చే మార్పులు గమనించి లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, వాటి వల్ల కలిగే నష్టాలు వివరించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యానికి అనుగుణంగా చదువుతూ మంచి ఫలితాలు సాధించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం నాగయ్యగౌడు, ఉపాధ్యాయ బృందం, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో బడుగు బలహీన వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 93 మంది లబ్ధిదారులకు రూ. 20.68 లక్షల విలువైన చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కలుగోట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు గోపాల్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

‘సొమ్ము ప్రజలది.. సోకు కాంగ్రెస్‌ది’

అయిజ: మున్సిపాలిటీలో నిర్మించిన హైమాస్ట్ లైట్లను మంగళవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ప్రజలు చెల్లించిన పన్నులతో పట్టణంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ రంగు, చేయి గుర్తు ఎలా వేస్తారని కమిషనర్ సీహెచ్ సైదులను ప్రశ్నించారు. అవసరమైన ప్రదేశాల్లో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయకుండా స్థానిక నాయకులు చెప్పిన ప్రదేశాల్లో అమర్చారని మండిపడ్డారు. వెంటనే హైమాస్ట్ లైట్ల కట్టలకు వేసిన కాంగ్రెస్ పార్టీ రంగులను, చేతి గుర్తులను తొలగించాలని కమిషనర్‌ను కోరారు. లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వెంకటేష్, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు వీరేష్‌గౌడ్, బూత్ అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.



హైమాస్ట్ లైట్ల వద్ద కాంగ్రెస్ పార్టీ గుర్తును చూయిస్తున్న బీజేపీ నాయకులు

పశువుల కొట్టాలను తలపిస్తున్నాయి

అయిజ: మున్సిపాలిటీలోని పలు ప్రైవేటు పాఠశాలలు పశువుల కొట్టాలను తలపిస్తున్నాయని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని న్యూ గీతాంజలి పాఠశాలను విద్యార్థి సంఘాల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. పాఠశాలలో బాత్రూం పక్కన విద్యార్థులను కూర్చోబెట్టి ఎలా చదువుచెబుతారని ప్రశ్నించారు. తరగతి గదుల్లోనే విద్యార్థులు భోజనం చేస్తున్నారని, అక్కడే చదువుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎలాంటి మౌలిక వసతులు లేవని, క్రీడా మైదానాలు కూడా లేవన్నారు. రోడ్ల పక్కన చిన్న చిన్న భవనాల్లో పాఠశాలలు నిర్వహించడానికి అధికారులు ఎలా అనుమతులు ఇస్తున్నారని ప్రశ్నించారు. నిబంధనలు పాటించని పాఠశాలల అనుమతులను వెంటనే రద్దు చేయకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు వీరేష్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల పరిసరాలు పరిశీలిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

‘ప్రజా సమస్యలపై పోరాడే పార్టీ సీపీఐ’

ఎర్రవల్లి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అని పార్టీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జింకలపల్లిస్టేజీలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ పాలనలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ నెల 23న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటిక్యాల మండల కార్యదర్శిగా సాతర్ల ఆశన్న, ఎర్రవల్లి మండల కార్యదర్శిగా శివలతో పాటు ఆయా గ్రామాల నాయకులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్కూరు రంగన్న, సవారి, పరుశరాం, యాదగిరి, ధన, కిట్టు, బీచుపల్లి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

గద్వాల: ఈనెల 9న నిర్వహించనున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని రైతాంగ సమితి నాయకులు జక్కుల వెంకటయ్య, ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికుల హక్కులను హరించేలా చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సార్వత్రిక సమ్మెను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతున్న క్రమంలో జిల్లాలోని పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపాల్, శంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతాంగ సమితి నాయకులు

పీయూ క్యాంటీన్ తెరవాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో నూతనంగా నిర్మించిన క్యాంటీన్ భవనాన్ని వెంటనే తెరవాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు రిజిస్ట్రార్ రమేశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీయూలో క్యాంటీన్ నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నప్పటికీ దానిని తెరవకపోవడంతో విద్యార్థులు తీవ్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిత్యావసర వస్తువుల కోసం యూనివర్సిటీ దాటి బయటికి వెళ్లి కొనుక్కోవాల్సి వస్తుందని, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా క్యాంటీన్‌ను తెరవాలని కోరారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రమేశ్‌బాబు మాట్లాడుతూ భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ ఇంకా యూనివర్సిటీకి అప్పగించలేదని, వీలైనంత త్వరగా తెరిపించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సంగీత, వేణుగోపాల్, నాగేశ్, రవితేజ, ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కేటీదొడ్డి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీపాదరెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ దేశానికి చేసిన సేవ, అభివృద్ధి పనుల గురించి తెలియజేయడమే రచ్చబండ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, గోవిందు, కృష్ణకాంత్, ముని, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఈదురుగాలులతో మోస్తరు వర్షం

రాజోళి: మండల కేంద్రం రాజోళిలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి మేఘావృతమై సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. పొలాల్లో విత్తనాలు విత్తుకున్న హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రాజోళిలో జోరుగా పడుతున్న వాన